క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఉర్దూ, ఫిజిక్స్, జువాలజి పోస్టుల కోసం సంబంధిత సబ్జెక్ట్‌ల్లో 55 శాతం మార్కులు ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు ఈ నెల 11న సాయంత్రం లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా



జడ్చర్ల టౌన్‌: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో వెన్నెల కల్చరల్ అకాడమి కళాకారులు శుక్రవారం కావేరమ్మపేట, జడ్చర్ల కొత్తబస్టాండ్‌లో ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా ప్రదర్శనలు ఇచ్చారు. పల్లెసుద్దులు పాడుతూ.. పాటల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కల్తీతమైన రక్తమార్పిడి, కలుషితమైన సూది, సిరంజిల ద్వారా హెచ్‌ఐవి సోకుతుందని అవగాహన కల్పించారు. రవిశంకర్, నర్సింహులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

హన్వాడ: ఉపాధ్యాయులు అందరూ విధినిర్వహణలో కచ్చితంగా సమయపాలన పాటించాలని డీఈఓ రవీందర్ సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని వేపూర్, గుండ్యాల్, మునిమోక్షం గ్రామాల్లోని పాఠశాలల్లో పర్యటించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

8న ఆసారే ముబారక్‌ల ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: మిలాద్‌- ఉన్‌- నబీ వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని హెచ్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 8న మహ్మద్ ప్రవక్త(స.అస) తన జీవితంలో వాడిన వస్తువులతో పాటు ఇతర అవులియల్లా, సాహిబిల వస్తువుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆలిండియా సున్ని ఉల్‌మా మషాయక్ బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మొహసిన్‌పాష ఖాద్రీ వెల్లడించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మహ్మద్ ప్రవక్త(స.అస) మూయే ముబారక్, తజ్బీ, జుల్బే, కమ్లితో పాటు బీబీ ఫాతిమా, హజ్రత్ అలీ, హజ్రత్ ఇమామే హసన్, హజ్రత్ ఇమామే హుస్సేన్, హజ్రత్ అబూబకర్ సిద్దిఖ్, హజ్రత్ ఉమరే ఫారుఖ్, హజ్రత్ ఉస్మానే ఘని, హజ్రత్ గౌసే ఆజంలకు చెందిన 140 వస్తువులను ప్రదర్శనలో ఉంచుతున్నట్లు వివరించారు.

ఐదో రోజు నిరసన

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళా ఉద్యోగుల ప్రమోషన్లలో తప్పుడు జీఓ కారణంగా నిలిచిపోనున్నాయని టీజీ ఎస్పీడీసీఎల్ కంపెనీ ప్రధాన కార్యదర్శి బీచుపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విద్యుత్ భవన్ ఎదుట ఐదో రోజు నిరసన వ్యక్తం చేశారు.

ఆలయంలో చోరీ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీ పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ హుండీలోని నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. హుండీలోని నగదు తీసుకెళ్లి, చిల్లర మాత్రం ఆలయ ప్రాంగణంలో వెదజల్లారు. ఆలయ కమిటీ సభ్యులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కమిషనర్‌పై ఫిర్యాదు

జడ్చర్ల టౌన్‌: మున్సిపల్ కమిషనర్ రాజయ్యపై కలెక్టర్‌కు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య తెలియజేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి ఉన్నారు.

డీజీపీని కలిసిన నాయకులు

నవాబుపేట: మండలానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు డీజీపీ జితేంద్రను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శుక్రవారం జెడ్పీటీసీల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, నారాయణ, సంతోష్‌రెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

నలుగురికి తీవ్ర గాయాలు

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో నలుగురికి గాయాలైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలియజేశారు. ఎస్‌ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న టీజీ07, 0619 నంబరు కారును పోతులమడుగు స్టేజీ వద్ద వెనుకాల నుంచి గుర్తుతెలియని డీసీఎం ఢీకొట్టింది. దీంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న మహేందర్‌రెడ్డి అతని భార్య ఆర్ప్రియా, కుమార్తె మహిర, అత్త గులాబీ, మామ అంజద్ అలీఖాన్‌లకు గాయాలయ్యాయి.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా



కొత్తగంజ్ వాసులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేసిన దర్పల్లి హరికృష్ణ

వినాయక చవితికి సిద్ధమైన మండపాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: వినాయక ఉత్సవాలను నిర్వహించేందుకు పట్టణాలు, గ్రామాల్లో మండపాలను సిద్ధం చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాలను విక్రయిస్తున్నారు. ముఖ్యంగా ఎనుగొండ, శ్రీనివాస్‌కాలనీల్లోని గణేష్ ప్రతిమ తయారీ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ప్రజలు, యువత, వినాయక సంఘాల నిర్వాహకులు వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. వినాయకులను వాహనాల్లో ఆయా మండపాలకు తరలిస్తున్నారు. పట్టణంలోని క్లాక్‌టవర్, పాన్‌చౌరస్తా, అశోక్‌టాకీస్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో సందడి నెలకొంది. పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఇకో క్లబ్ ఆధ్వర్యంలో 200 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మా అనురాధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలోని అంబాభవాని దేవాలయంలో శుక్రవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ సతీమణి వాకిటి లలిత మట్టి వినాయకులను పంపిణీ చేశారు.



అంబాభవాని ఆలయంలో వినాయకులను పంపిణీ చేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి సతీమణి లలిత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొత్తగంజిలో నీలకంఠ మల్లికార్జునస్వామి దేవస్థానం వద్ద బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ దర్పల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను కాలనీ వాసులకు పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణలో మేముసైతం

జడ్చర్ల టౌన్‌: పర్యావరణ పరిరక్షణలో మేము సైతం అంటూ మండలంలోని ఆలూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థులు మట్టి గణపతుల తయారీ చేశారు.

అడ్డాకుల: మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో బీఆర్‌ఎస్ నాయకులు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఎం.జితేందర్‌రెడ్డి, రంగన్నగౌడ్, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్‌: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం 1,000 మట్టి వినాయకులను పంపిణీ చేశారు. రామకృష్ణ, శివకిశోర్ పాల్గొన్నారు.

గణపతుల తయారీ..

నవాబుపేట: పర్యావరణం కాపాడాలని, మట్టితో చేసిన గణపతులను పూజించాలని చిన్నారులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో చాణుక్య పాఠశాల చిన్నారులు మట్టి గణపతులు తయారు చేశారు. రంగుల గణపతులతో కలిగే అనర్థాలను వివరించారు.

మండపాలు సిద్ధం..

చిన్నచింతకుంట: వినాయక చవితిని పురస్కరించుకొని గ్రామాల్లో వినాయకులను ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు మండపాలను సిద్ధం చేశారు. మండపాలకు రంగురంగుల కాగితాలు, రంగుల వస్త్రాలతో ముస్తాబు చేశారు.

నేడు కలెక్టరేట్‌లో వేడుకలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వినాయక చవితి సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయం వరండాలో గణేష్‌ను ప్రతిష్ఠించనున్నట్లు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ తెలియజేశారు. శుక్రవారం గణేష్ మండపాన్ని ఏర్పాటు చేశామని, శనివారం కలెక్టర్ విజయేందిర వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని వివరించారు. ప్రతి రోజూ ఒక్కో అధికారి పూజలు చేస్తారని, ఉన్నతాధికారుల సహకారంతో గణేష్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి

భూత్పూర్: వర్షాలు తగ్గినప్పటికీ గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముమ్మరంగా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ విజయేందర అన్నారు. శుక్రవారం మండలంలోని పోతులమడుగులో కలెక్టర్ పర్యటించారు. పోతులమడుగు–గోపన్నపల్లి మధ్య కాజ్‌వేపై వరదనీరు పొంగి పారుతుండగా.. కలెక్టర్ పరిశీలించారు. కాజ్‌వేకు ఇరువైపులా ఎర్రటి గుడ్డలతో జెండాలు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. రెండు గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎవరూ వాగు దాటే ప్రయత్నం చేయకుండా ఉండేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఓటరు ఇంటింటి పరిశీలన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

పౌష్టికాహార లోపంతో బాధపడకూడదు..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంత మురుగు వాడలోని 5 సంవత్సరాలలోపు పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ విజయేందిర అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో 'పర్యవేక్షణతో కూడిన అనుబంధ పోషకాహార కార్యక్రమం' పై నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్‌లు సమన్వయంతో పనిచేసి పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు పౌష్టికాహారం, ఆరోగ్యాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు.



పోతులమడుగు కాజ్‌వే వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

అన్ని వార్డుల్లో డ్రై డే



కావేరమ్మపేటలో పరిశీలిస్తున్న ఎస్. రాజయ్య

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని మొత్తం 49 వార్డుల పరిధిలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

దేవరకద్ర: పట్టణంలోని పలు వార్డుల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం ఇంటింటా తిరిగి నీటి నిల్వలను పారబోశారు. డ్రై డే సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు దోమలను నివారించే కార్యక్రమంలో భాగంగా ఇళ్లలోని తొట్లలో, ఇతర పాత్రల్లో నిల్వ చేసిన నీటిని పార బోశారు.



ఏనుగొండలోని ఓ పాత ఇంట్లో నివసిస్తున్న వారికి నోటీసు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జడ్చర్ల టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేటలో డ్రైడే కార్యక్రమాన్ని కమిషనర్ ఎస్.రాజయ్య పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి డ్రైడే తీరును విచారించారు. అలాగే నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొన్ని ఇళ్లలో నీరు నిల్వ ఉండగా.. వాటిని ఆయన పారబోయించారు. మహేష్, ఆర్పీలు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ

మహమ్మదాబాద్: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో రుణమాఫీ, ప్రభుత్వ పథకాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలను వ్యవసాయాధికారులు సేకరిస్తున్నారని, కొంత ఆలస్యమైనా.. అర్హులైన ప్రతిఒక్కరికీ రుణమాఫీ చేసి తీరుతామన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు.



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కరపత్రం విడుదల

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన విజయోత్సవ సభ కరపత్రాలను శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు మాట్లాడారు. అలుపెరగని పోరాటానికి సామాజిక న్యాయం దక్కిందన్నారు. 21న నారాయణపేట జిల్లా మరికల్‌లో విజయోత్సవ సభ నిర్వహిస్తామని, సభకు టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుకు రాజు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దుచేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: వక్ఫ్ సవరణ బిల్లుపై ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వేస్టేషన్ సమీపంలోని మసీద్ ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని న్యూఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ పార్లమెంట్ జాయింట్ సెక్రెటరీకి మెయిల్ ద్వారా వినతి పంపినట్లు తెలియజేశారు. గులాం మహ్మద్, మహ్మద్ యాఖూబ్ అసద్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు కమిటీలో ఎంపీ

పాలమూరు: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై శుక్రవారం ఢిల్లీలో జాయింట్ పార్లమెంట్ కమిటీ కీలక భేటీ కాగా.. అందులో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. తెలంగాణలో వక్ఫ్ భూముల వివాదాల వ్యవహారాలను జేపీసీ దృష్టికి డీకే అరుణ తీసుకెళ్లారు. జేపీసీ వివాదాలపై వినతి అందజేశారు.

తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ రాజకీయ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి మృతిపై ఎంపీ డీకే అరుణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రసాధన పోరాటంలో జిట్టా బాలకృష్ణారెడ్డి పాత్ర మరువలేనిదని తెలియజేశారు.

చెరువుకు పూజలు

నవాబుపేట: మండల పరిధిలోని కూచూర్‌కి చెందిన పెద్దచెరువు అలుగు పారటంతో చెరువుకు శుక్రవారం గ్రామస్తులు పూజలు చేశారు.

చిన్నచింతకుంట: మండలంలోని చిన్నచింతకుంట, తిర్మలాపురం, ముచ్చింతల, అప్పంపల్లి, ఉంద్యాల గ్రామ నల్లకుంట, చెరువులు అలుగు దూకాయి.

గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ

నవాబుపేట: తాజాగా కురుస్తున్న వానలపై మండల అధికారుల బృందం ఆరా తీసింది. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలో పలు గ్రామాలు పర్యటించి పారిశుద్ధ్యంపై ఆరా తీశారు. అలాగే గ్రామాలకు చెందిన చెరువులు, అలుగులు పరిశీలించారు. ఈ సందర్భంగా కామారంలో చెరువు నీటితో కల్వర్టు చెంత రోడ్డు శిథిలమైన ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామాలకు వెళ్లిన వారిలో ఎంపీడీఓ జయరాంనాయక్, బద్రునాయక్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఓటర్ల సర్వే

చిన్నచింతకుంట: ఇంటింటి ఓటర్ల సర్వేను పగడ్బందీగా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సి.కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఇంటింటి ఓటర్ల సర్వే నిర్వహించారు.

దేవరకద్ర: మండలంలోని మీనుగోనిపల్లి, గుడిబండ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముకుందరెడ్డి స్వయంగా ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు.

వెన్నాచేడ్‌లో

గండేడ్: ఓటర్ల సవరణ జాబితాలో భాగంగా గండేడ్ మండల పరిధిలో ఆయా గ్రామాల్లో ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని వెన్నాచేడ్‌లో ఈ సర్వే కొనసాగుతుంది. ఓటర్ల జాబితాలో వారి పేరు ఉందా లేదా, తప్పుగా ఏమైనా నమోదయ్యిందా వార్డు, వయస్సు, ఇంటిపేరు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బుచ్చారెడ్డి సేవలు చిరస్మరణీయం

రాజాపూర్: ముదిరెడ్డిపల్లి సర్పంచ్‌గా బుచ్చారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాజాపూర్‌లోని ముదిరెడ్డిపల్లిలో సర్పంచ్ బచ్చారెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. బచ్చిరెడ్డి, మల్లేష్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు

గండేడ్: ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పీఆర్‌టీయూ టీఎస్ ముందంజలో ఉందని మండల శాఖ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మన్సూర్‌పల్లి, కొండాపూర్, బల్సూర్‌గొండ, పగిడ్యాల్ తదితర గ్రామాల్లో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, రవీందర్, కృష్ణయ్య, కొండన్న పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

రాజాపూర్: అధికారం కోల్పోయినా.. బీఆర్‌ఎస్ నాయకులు అహంకారపు మాటలు వీడలేదని, అహం వీడి అభివృద్ధికి సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కల్యాలక్ష్మి చెక్కులను ప్రోటోకాల్ విస్మరించి, ప్రభుత్వ పాఠశాలలో పంపిణీ చేశారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించిన విషయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సమావేశంలో సీనియర్ నాయకులు నరహరి, యాదయ్యవిక్రంరెడ్డి, కృష్ణయ్యగౌడ్, లక్ష్మణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ



చిన్నచింతకుంట: దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి మృతిచెందగా.. గురువారం అంత్యక్రియలు ముగిశాయి. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, నారాయణపేట కాంగ్రెస్ నాయకుడు కుంభం శివకుమార్‌రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నివాసానికి చేరుకొని కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

బాధితులను ఆదుకోండి

మహబూబ్‌నగర్ రూరల్: ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలతో సబ్బండ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, పలు గ్రామాల్లో ఇళ్లు కూలి మృతిచెందిన సంఘటనలు ఉన్నాయని ఎమ్మార్పీఎస్(టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. వర్షం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు వెంకటయ్య, వెంకట్రాములు, స్వామి, రమేష్ తదితరులు ఉన్నారు.

06ఎంబీఎన్‌ఆర్‌ఎల్851 మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి అందజేస్తున్న ఎమ్మార్పీఎస్(టీఎస్) నాయకులు

నాయకుల పరామర్శ

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌కి చెందిన మాణిక్యమ్మ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదానికి గురైన చంద్రశేఖర్‌గౌడ్‌ను పరామర్శించారు.

ఆర్థిక సాయం అందజేత

నవాబుపేట: మండల కేంద్రంలో ఎల్సారీ రాములమ్మ(54) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందగా.. అమె అంత్యక్రియలకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహచారి రూ.5 వేల నగదును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఘనంగా గురుపూజోత్సవం

పాలమూరు: రెడ్‌క్రాస్ సన్నిధి ఆశ్రమంలో శుక్రవారం భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురు పూజోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆశ్రమంలో పనిచేస్తున్న సిబ్బందిని సత్కరించారు. నటరాజ్, జగపతిరావు, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు భక్తిశ్రద్ధలతో పూజలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయంలో అఖండ దీపారాధన పూజలు నిర్వహించారు. శివాలయంలోకి వచ్చిన గోమాతకు పూజలు చేశారు.

St.Mary's College of Education
(Approved by NCTE, Affiliated to Palamuru University)
Padmavathi Colony, Mahabubnagar-9000624135
Wanted Faculty
Applications are Invited from Qualified faculty for B.Ed Course
1.Principal: P.G With M.Ed and Ph.D (In Education) with 8 years Experience
2.Lecturer in Performing Arts P.G With Performing Arts with 55% marks in Both Subjects
Apply within 15 days. Can be sent Resume through e-Mail also.
Sd/- Correspondent/Secretary
Cell No:9000624135, 9966414566. Mail ID:stmarybedcollege@gmail.com

నిండిన పాలమూరు పెద్దచెరువు



పెద్దచెరువులోకి చేరుతున్న నీరు

- 2 అలుగుల తూముల నుంచి బయటకు వదిలివేత
- బీకేరెడ్డికాలనీ, బీఎన్‌రెడ్డికాలనీ, రామయ్యబౌలిలలో రోడ్లపైకి వచ్చిన వరద నీరు
- లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచన



బీకేరెడ్డికాలనీలోని ఓ వీధిలో రోడ్డుపై పారుతున్న వరద నీరు



షాషాబ్‌గుట్ట నుంచి భగీరథ కాలనీ వైపు వెళ్లే మార్గంలో పరిస్థితిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా కేంద్రంలోని పెద్దచెరువు నిండింది. తాజాగా గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఎగువ ప్రాంతంలోని నాలుగు చెరువుల నుంచి పాటు కాల్వల ద్వారా వరద ఉద్ధృతంగా వస్తూనే ఉంది. దీంతో బీకేరెడ్డికాలనీ, రామయ్యబౌలి వైపు ఉన్న రెండు అలుగుల వద్ద తూములను తెరిచి కిందికి వరదను వదులుతున్నారు. దీంతో లోతట్టు లోని బీకేరెడ్డి కాలనీ, బీఎస్‌రెడ్డి కాలనీ, నాగిరెడ్డి కాలనీ, రామయ్య బౌలిలలో డ్రెయిన్లు నిండి పొంగి పొర్లి గల్లీ రోడ్లపైకి వచ్చింది. మరోవైపు పెద్దచెరువు ఊట నీరు ప్రధాన రోడ్డుపైకి ఉద్ధృతంగా చేరింది. వాహన దారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా, లోతట్టు ప్రాంతాల్లో ఉండే వారికి ముందస్తుగా ఇళ్లలో నుంచి పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని మున్సిపల్ అధికారులు దండోరా వేయించారు. విషయం తెలుసుకున్న స్థానిక అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ శుక్రవారం నీటిపారుదల శాఖ డీఈఈ మనోహర్, మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి పెద్దచెరువుతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోతట్టు ప్రాంత వాసుల కోసం తగిన పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందరూ జాగ్రత్తగా ఉండాలని వారు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ఎంఈ యు.బస్వరాజ్, డీఈఈ సందీప్, ఏఈలు హరికృష్ణ, వైష్ణవి, నుస్రత్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘాన్సీరాం తదితరులు పాల్గొన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com